క్లుప్తంగా

రెండో రోజూ శ్రమదానం



మొక్కలు నాటుతున్న జీవీఎంసీ జోన్–8 జేసీఎస్ కన్వీనర్ చిన్ని

పెందుర్తి: జాతీయ సేవా పథకంలో భాగంగా గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు లక్ష్మీపురం,పోర్టు కాలనీ ప్రాంతాల్లో రెండో రోజు గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. జోన్–8 జేసీఎస్ కన్వీనర్ మనాలత జోబ్‌దాస్ (చిన్ని), ప్రిన్సిపాల్ మురళీమోహన్ రావు, ఎన్ఎస్ఎస్ అధికారి సీహెచ్ ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి



మృతి చెందిన శంకర్రావు

పరవాడ : దేశపాత్రునిపాలెం రైల్వే వంతెన వద్ద ఓ వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గురువారం పరవాడ పోలీసులు కనుగొన్నారు. మృతుడు స్టీల్ ప్లాంటు ఉద్యోగి ఎం.శంకర్రావు (52)గా గుర్తించారు. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న శంకర్రావు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై దేశపాత్రునిపాలెం వస్తుండగా రైల్వే వంతెన వద్ద గోతిలో వాహనం బోల్తా పడింది. ఆ సమయంలో స్థానికంగా ఎవరు అందుబాటులో లేని కారణంగా శంకర్రావు రాత్రంతా అక్కడే గాయాలతో ఇబ్బంది పడ్డాడు. ప్రమాదంలో శంకర్రావుకు కుడి చేయి విరిగిపోయి ముఖానికి గాయాలయ్యాయి. వంతెన వద్ద గల దుకాణదారులు గురువారం ఉదయం వచ్చి చూడగా కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి సపర్యలు చేశారు. నీళ్లు తాగిన మరుక్షణమే మృతి చెందాడని పోలీసులు చెప్పారు. సమాచారాన్ని అందుకున్న బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనకాపల్లి ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ చెప్పారు.

ఆహా ఏమి రుచి..

పెందుర్తి జీపీటీలో ‘ఫైర్‌లెస్ కుకింగ్’ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



పెందుర్తి: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులు, స్కిల్ హబ్ ట్రైనీలు, విద్యార్థులు రకరకాల వంటకాలతో అదరగొట్టారు. గురువారం కళాశాల ఆవరణలో ‘ఫైర్‌లెస్ కుకింగ్’ పేరిట నిర్వహించిన వినూత్న పోటీల్లో వీరు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 20 రకాల నోరూరించే వంటకాలు, పదార్థాలను నిప్పు లేకుండా తయారు చేశారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

సంక్రాంతి సందడి



చిన్నారులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, అధ్యాపక బృందం



డూడూబసవన్న వేషధారణలో చిన్నారులు

పరవాడ: మండలంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలను పచ్చని తోరణాలతో ముస్తాబు చేశారు. రంగురంగుల ముగ్గులు..ఆట పాటలు..సంప్రదాయ వస్త్రధారణలతో చిన్నారులు అలరించారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ రైతులు ఆనందంతో చేసుకొనే పండుగే సంక్రాంతి అని అన్నారు. పాఠశాల డైరెక్టర్ ఉదయ నాగశ్రీ తదితరులు సంక్రాంతి ప్రధాన్యతను వివరించారు. చిన్నారులు చరిష్మా సౌర్య, సంజయ్, తరుణ్, జైనిష్‌లు ప్రదర్శించిన సోదమ్మ, హరిదాసు, బసవన్న, బుడబుక్కల జంగం వేషధారణలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకునేలా నిర్వహించిన ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, పూజిత, వినీలా, రేఖ, లీలాలను పాఠశాల సీఈవో నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి అభినందించారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు



ఇంటికి షోకాజ్ నోటీసు అతికిస్తున్న సిబ్బంది

సబ్బవరం: అంగన్‌వాడీల ప్రభుత్వం ఎస్మా ప్రయోగించినప్పటికీ విధుల్లో చేరకపోవడంతో సబ్బవరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు ఐసీడీఎస్ సిబ్బంది షోకాజ్ నోటీసులను అందజేశారు. సబ్బవరం ప్రాజెక్టు పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాలలోని 136 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, 24 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు, 126 మంది ఆయాలకు నోటీసులు అందజేశామని సీడీపీవో లలిత్ కుమారి తెలిపారు. అంగన్వాడీ సిబ్బందికి స్వయంగా అందజేస్తే వారు తిరస్కరించారని, దీంతో వారి ఇళ్లకు నోటీసులు అతికించామన్నారు.

సంతకాల సేకరణ



సంతకాలు సేకరిస్తున్న ఐడీ బాబు తదితరులు

సబ్బవరం : భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం, భారీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా మొగలిపురంలో సంతకాల సేకరణ నిర్వహించారు. విజయవాడలోని స్వరాజ్య మైదానంలో ఈ నెల 19న అంబేడ్కర్ స్మృతి వనంతో పాటు 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఇంతటి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో ప్రభుత్వానికి, వైఎస్సార్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ ఐడీ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంతకాల సేకరణతో పాటు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఇండుగుబిల్లి గోపి, ఈశ్వరరావు, గొటివాడ అప్పారావు, గొటివాడ సత్యనారాయణ, ఐ.రాజు, పి.తాతబాబు, గొటివాడ అర్జునరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.సంతోషి, వెల్ఫేర్ అసిస్టెంట్ రేష్మా ప్రవళ్లిక, మహిళా పోలీస్ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జెడ్పీటీసీ సన్యాసిరాజు

పరవాడ: విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ రంగంలో నవరత్నాలు అనే సంస్కరణల క్యాలెండర్, డైరీలను గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కార్యనిర్వహణ అధికారి పోలినాయుడు, ఏపీఈపీడీసీఎల్ సూపరింటిండెంట్ ఇంజినీర్ మహేంద్ర, డీఈఈ సుమన్‌రాజ్, కుమార్ పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ఘనంగా కుంకుమ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం స్వామివారికి విశేష పూజలు జరిపారు. తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 26వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



దివ్యాంగులకు బహుమతులను అందజేస్తున్న శ్రీనివాసరావు

పరవాడ: అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ 215వ జయంతిని మరిడిమాంబ కల్యాణ మండపంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు పాల్గొని లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కొనియాడారు. బ్రెయిలీ లిపిని నేర్చుకొని నేడు అనేక మంది వివిధ రంగాల్లో విజయం సాధిస్తున్నారన్నారు. దివ్యాంగుల కోసం ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక పథకాలను మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. దివ్యాంగుల సాధికారిత కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, సాధన సంస్థ కార్యదర్శి షేక్ ఇస్మాయిల్, మండల యూత్ అధ్యక్షుడు కంచిపాటి భాస్కర్ పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా ధారోత్సవాలు



గంగధార వద్ద గోదాదేవికి అభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



విశేష అలంకారంలో గోదాదేవి

సింహాచలం : సింహగిరిపై గురువారం నుంచి ధారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలను పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో వేంజేంపజేసి ఆలయంలో నుంచి తిరువీధిగా సింహగిరిపై ఉన్న గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అమ్మవారిని వేంజేంపజేసి గంగధార జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అక్కడే ఉన్న పురాతన మండపంలో అమ్మవారిని వేంజేంపజేశారు. విశేష ఆరాధన, తిరుప్పావై సేవాకాలాన్ని నిర్వహించారు. పాశుర విన్నప పారాయణాన్ని విశేషంగా పఠించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో వేంజేంపచేసి ఆలయంలోకి తీసుకెళ్లి బేడా మండపంలో తిరువీధిని నిర్వంచారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు చిన్నా తదితరులు ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి సతీసమేతంగా ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర
- స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈఓ పోలినాయుడు



సమావేశానికి హాజరైన సభ్యులు,అధికారులు

మహారాణిపేట (విశాఖ): సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని, సామాన్య ప్రజల ఆర్థిక పురోగతికి తోడ్పాటు అందించాలని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆమె అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరిగాయి. వీటిలో అభివృద్ధి పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను అధికారులు చదివి వినిపించారు. వాటిపై సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తగా ఆయా శాఖల అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఇప్పటి వరకు తీసుకున్న, చేపట్టనున్న చర్యలను వివరించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పని చేస్తున్న వారికి అండగా నిలవాలని పేర్కొన్నారు. మైదాన ప్రాంతాల్లో మాదిరిగా పాడేరు, అరకు ప్రాంతాల్లో కూడా మహిళా మార్ట్‌లను ప్రారంభించాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో మరింత నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తూ పూడిక తొలగింపు, కాలువలు శుభ్రత చేపట్టాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి కల్పించాలని చెప్పారు. కొన్ని మండలాల్లో దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది పనితీరు బాగోలేదని సభ్యులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవోను ఆదేశించారు. సభ్యుల సూచన మేరకు బెల్టు షాపులపై దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. మినీ గోకులాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

వారంలో బిల్లుల మంజూరు

15వ ఆర్థిక సంఘం కాల పరిధిలో చేపట్టే పనులకు వారం రోజుల్లోపే బిల్లులు మంజూరు చేస్తామని జెడ్పీ సీఈవో ఎం. పోలినాయుడు తెలిపారు. ఆయా పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరారు. ప్రారంభ, మధ్యస్థ పనులకు సంబంధించి వేర్వేరుగా ఎం.బుక్‌లు సమర్పించినా బిల్లులు మంజూరు చేస్తామని వెల్లడించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ విభాగాల్లో చేపట్టే పనులకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆయన చెప్పారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం బిల్లులు తక్షణం చెల్లించాలని పలువురు సభ్యులు కోరారు. చాలా కాలం నుంచి ఈ బిల్లులు రాలేదని, అలాగే కాంపోనెట్ కూడా విడుదల కాలేదని అనంతగిరి జెడ్పీటీసీ గంగరాజు, గొలుగొండ జెడ్పీటీసీ గిరిబాబు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. నాడు–నేడు పనులకు తక్షణం బిల్లులు మంజూరు చేయాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బస్సులు, రైళ్లు కిటకిట

- సొంతూరు బయలుదేరిన నగరవాసులు
- సందడిగా బస్, రైల్వే స్టేషన్



ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ వద్ద ప్రయాణికులు



కిటకిటలాడుతున్న రైల్వే స్టేషన్



డాబాగార్డెన్స్: ప్రయాణికులతో ద్వారకా బస్టేషన్, విశాఖపట్నం రైల్వే స్టేషన్ గురువారం కిటకిటలాడింది. ఉపాధి నిమిత్తం సుదూర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారంతా సంక్రాంతి పండక్కి తమ స్వగ్రామాలకు బయలుదేరారు. దీంతో ద్వారకాబస్టేషన్, రైల్వేస్టేషన్‌కు ఒక్కసారిగా ప్రయాణికులు పోటెత్తారు. కుటుంబ సభ్యులతో సహా చేరుకున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఏపీఎస్ఆర్టీసీ ద్వారకా బస్టేషన్ నుంచి 250 ప్రత్యేక సర్వీసులను సాధారణ చార్జీలతోనే నడుపుతోంది. విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు 30 ప్రత్యేక సర్వీసులు, విశాఖపట్నం నుంచి విజయవాడకు 60, విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం, రాజాం, పాలకొండ, పార్వతీపురం, సోంపేట, బొబ్బిలి, పలాసకు 100, విశాఖపట్నం నుంచి అమలాపురం, భీమవరంకు 10, రాజమండ్రికి 25, కాకినాడకు 25 బస్సులు తిప్పుతోంది.

ప్రగతి పథంలో పెందుర్తి

పెందుర్తి: ఇటు గ్రామీణం నేపథ్యం..అటు పట్టణ అభిరుచికి దగ్గరగా ఉన్న ప్రాంతం పెందుర్తి. నగర శివారులో అత్యంత వేగంగా ప్రగతిపథంలో పెందుర్తి దూసుకుపోతోంది. ప్రస్తుతం కమర్షియల్‌గా నగరానికి దీటుగా ముందడుగు వేస్తోంది. ఒకప్పుడు రెండు మూడు వేల గడపతో మారుమూల ప్రాంతంగా ఉన్న పెందుర్తి ప్రస్తుతం అత్యంత ఖరీదైన ప్రాంతంగా మారుతోంది. ఇక్కడ చిన్నాపెద్దా కంపెనీల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్న కారణంగా ఉద్యోగులు, వ్యాపారస్తులు, ఇతర ఉన్నత వర్గాల ప్రజలు ఈ ప్రాంతానికి ఆకర్షితులవుతున్నారు. పెందుర్తి పరిసర ప్రాంతాల్లో స్థలాలు కొనుగోలు చేసి తమ అభిరుచికి అనుగుణంగా స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో కమర్షియల్‌గా ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందింది.


పెందుర్తి ప్రాంతం

రియల్ ఎస్టేట్ దూకుడు

పదేళ్లుగా పెందుర్తి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ గణనీయంగా అభివృద్ధి చెందింది. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, పురుషోత్తపురం, వేపగుంట, నాయుడుతోట ప్రాంతాల్లో అత్యధిక కొనుగోలు శక్తి కలిగినవారు ఉండడంతో వాణిజ్య, ఆస్తి పెట్టుబడిదారులకు ఇది నెలవుగా మారింది. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ రంగంలో అత్యధిక పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. పెందుర్తి ప్రాంతంలో అధిక శాతం వ్యాపారులు, ప్రభుత్వ ఉన్నతోద్యోగులతో పాటు భారీ, మధ్య తరగతి కంపెనీలు సమీపంలో ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం లాభదాయకంగా ఉంది. ఈ విషయాన్ని గుర్తించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు విరివిగా ఇండివిడ్యువల్ స్థలాలు/ఇళ్లతో పాటు గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లను వేయడానికి అమితాసక్తి చూపుతున్నారు. దీంతోపాటు ఈ ప్రాంతంలో బేకరీలు, హోటళ్ల వ్యాపారం కూడా అభివృద్ధి చెందింది. సుజాతనగర్, చినముషిడివాడ ప్రాంతాల్లో ఇటీవల కాలంలో పదుల సంఖ్యలో హోటళ్లు వెలిసి లాభదాయకంగా నడుస్తున్నాయి. పెందుర్తి శివారు ప్రాంతాల్లో దాబాలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.

ప్రశాంత వాతావరణం..

గ్రామీణ ప్రాంతానికి అతి దగ్గరగా ఉన్న పెందుర్తి ప్రాంతం ఇంతగా కమర్షియల్ హంగులు పులుముకోవడానికి ప్రధాన కారణం ప్రశాంత వాతావరణలలో జీవనం సాగించే వెసులుబాటు ఉండడమే. నగరంలో ముఖ్య ప్రాంతాలతో పోల్చితే పెందుర్తి ప్రాంతంలో కాలుష్యం బెడద తక్కువ. అదే సమయంలో నగరంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ రోడ్లు విస్తరణ జరగడం ఈ ప్రాంత అభివృద్ధికి మరో కారణం. నగరంలోని ఏ ప్రధాన కూడలికి అయినా పెందుర్తి నుంచి బీఆర్‌టీఎస్ రహదారిపై కేవలం 30 నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉండడంతో పెందుర్తి ప్రాంతంలో ఉండేందుకు అంతా ఆసక్తి కనబరుస్తున్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

పెందుర్తి: పెందుర్తిలోని బాలాజీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు రంగవల్లులు, బొమ్మల కొలువులతో ఆకట్టుకున్నారు. గంగిరెద్దుల వేషధారణలతో అలరించారు. ఆటపాటలతో సందడి చేశారు. బాలాజీ విద్యా సంస్థల అధినేత కె.నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.


బాలాజీ కళాశాలలో పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

కేబీఎస్‌లో జుట్టు సమస్యలకు పరిష్కారం

పెందుర్తి: సుజాతనగర్‌లోని కేబీఎస్ సెలూన్‌లో జుట్టు, చర్మ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మేనేజింగ్ డైరెక్టర్ కె.ప్రశాంతి తెలిపారు. తమ సెలూన్‌లో లేడీస్, జెంట్స్‌తో పాటు పిల్లలకు కూడా బ్యూటీ సర్వీసులు అందిస్తున్నామన్నారు. హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్, హైడ్రా ఫేషియల్ వంటి సర్వీసులు అధునాతన పద్ధతిలో అందిస్తామని చెప్పారు. సంక్రాంతి సందర్భంగా పలు సర్వీసులపై ప్రత్యేక డిస్కౌంట్లు కూడా ఇస్తున్నామన్నారు. బ్రైడల్ సర్వీస్‌లపై కూడా ఆఫర్లు ఉన్నాయని చెప్పారు.


ప్రశాంతి, కేబీఎస్ సెలూన్ ఎండీ

అభి'రుచి'కి కేరాఫ్ అంబిక

పెందుర్తి: పెందుర్తి నడిబొడ్డున దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం వెలసిన శ్రీఅంబిక బేకరీ, స్వీట్స్ ప్రస్తుతం ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజల అభి'రుచి'కి చేరువైంది. సంప్రదాయ పద్ధతిలో నాణ్యమైన మిఠాయిలు, బేకరీ పదార్థాలను అందిస్తున్న అంబిక దినదినాభివృద్ధి చెందింది. నాడు చిన్నపాటి భవనంలో ప్రారంభమైన అంబిక ప్రస్థానం నేడు నగర వ్యాప్తంగా బ్రాంచ్‌లతో పాటు విజయనగరం జిల్లా వ్యాప్తంగా కూడా బ్రాంచ్‌లు పెట్టి అక్కడి ప్రజలకు నాణ్యతలో రాజీ పడకుండా స్వీట్స్ అందిస్తోంది. విశాఖ, విజయనగరం ప్రాంతాల్లో శుభకార్యాలు, ఆధ్యాత్మిక వేడుకలకు స్వీట్స్ కావాలంటే అంబికానే కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. అంబిక సంస్థ ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 300 మందికి ఉపాధి కల్పిస్తోంది. రానున్న రోజుల్లో కూడా తమ బ్రాండ్‌కు తగ్గట్లుగా ప్రజలకు నాణ్యతతో కూడిన స్వీట్స్‌ను అందుబాటు ధరల్లో అందించడమే తమ లక్ష్యమని అంబిక స్వీట్స్ అధినేత నూలు గణేష్ చెబుతున్నారు.

